# మొసలి కన్నీరు

"ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవు" అన్నది ఆమె.

"ప్రయత్నం చేస్తాను" అన్నాడు సహదేవుడు.

"అసాధ్యమని స్పష్టంగా తెలిసి చేసే ప్రయత్నంవలన ప్రయోజనం ఉండదు" అన్నది పారిజాతం.

"అనివార్యమయినప్పుడు తప్పదు జాతం" అంటూ నవ్వాడు సహదేవుడు.

"కోరుకున్నదానికోసం ప్రయత్నం చేస్తూనే ఉంటావు. నీలో నాకు నచ్చింది ఇదే. అందుకే నువ్వంటే నాకు ఇష్టం" అన్నది మళ్ళీ పారిజాతం మెచ్చుకోలుగా.

"ఎగ్జాక్ట్‌లీ.... నామీద నీకున్న ఇష్టాన్ని నిలుపుకుంటాను. నన్ను విశ్వసించు పారిజాతమా" అని సహదేవుడు రెండడుగులు ముందుకి వేసాడు. అతడి భుజానికి బేగ్ వేల్లాడుతోంది.

వెన్నెలరోజులు కాదు. అక్కడ చీకటిగా ఉంది. కొంచెం దూరంలో వీధిదీపం వెలుగుతోంది.

అప్పటికే అంతా వెళ్ళిపోయారు.

కార్యక్రమం ముగిసి చాలాసేపయింది.

పారిజాతం ఒంగి పాదాల దగ్గర ఉన్న బేగ్‌ను తీసి కుడివైపు భుజానికి తగిలించుకుని సహదేవుడివైపు చూసి "ఇక వెళదామా?" అనడిగింది.

అతడు సరేనన్నట్టు తల ఊపాడు గానీ చీకట్లో ఆమెకు కనిపించలేదు.

"పద" అన్నాడతను నడుస్తూ. ఆమె అతడిని అనుసరించింది.

కొంచెంసేపటికి ఇద్దరూ కొంచెం వెలుతురుగా ఉన్న రోడ్డుమీదకు వచ్చారు.

రోడ్డుమీద జనసంచారం లేదు. అతడు మౌనంగా నడుస్తున్నాడు. ఆమె అతడి మౌనాన్ని అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తూ నడుస్తోంది.

వాళ్ళిద్దరూ ఒక పాటకచేరీ ప్రోగ్రాంలో కలిసారు. పారిజాతం గాయనీమణి. లలిత గీతాలూ, జానపద గీతాలూ, భక్తి గీతాలనూ శ్రావ్యంగా పాడుతుంది. ఇక సహదేవుడు వాద్యకారులు బృందంలో ఒకరకం వాయిద్యాన్ని అమోఘంగా పలికిస్తాడు. మనసులో సహదేవుడికంటే కొంచెం పెద్దదయిన పారిజాతానికి పెళ్ళయ్యింది. సహదేవుడికి కూడా పెళ్ళయ్యింది. కానీ సహదేవుడితో ప్రేమలోకి

దిగేటప్పుడు పారిజాతానికి తనకు పెళ్ళయిన విషయం గుర్తుకు రాలేదు.

పాటకచేరీ జరిగిన ఆడిటోరియానికి బస్టాండు దగ్గరే కాబట్టి వాళ్ళు కొంతసేపటికి అక్కడకు నడిచే వచ్చారు. అంతగా వెలుతురు లేని ఆ రోడ్డుమీద అతడి ప్రక్కన నడుస్తూ అక్కడకు రావడం పారిజాతానికి థ్రిల్లింగ్‌గా అనిపించింది.

గత స్మృతులు నెమరుకు వచ్చాయి.

"థాంక్స్ సహదేవుడూ" అనుకుంది ఆమె మనసులో.

❖ ❖ ❖

రాత్రి పదకొండు గంటలు కావస్తుంది.

సిగరెట్లకోసం గబగబా నడుస్తూ వాళ్ళింటికి దగ్గరిలో ఉన్న సెంటర్లో తెరచిఉన్న పాన్‌షాప్ దగ్గరకు వచ్చాడు సహదేవుడు. ఆ షాపు రాత్రి పన్నెండు గంటల వరకూ తెరిచే ఉంటుంది. అందులో ఒక ముసలాయన కూర్చుని కునికిపాట్లు పడుతూ నిగరెట్లు అమ్ముతూ ఉంటాడు.

సహదేవుడు తనకు కావలసిన సిగరెట్లు కొని అక్కడే ఉన్న ఒక మాసిపోయిన కుర్చీలో కూర్చున్నాడు. ముందు ఒక సిగరెట్టు కాల్చుకోవాలి.

పెట్టెలోనించి సిగరెట్టును బయటకు లాగుతున్నప్పుడు షర్టు జేబులో ఉన్న సెల్‌ఫోను రింగయ్యింది.

బటన్ నొక్కి హలో అంటే అవతల్నించి పారిజాతం గొంతు వినపడింది –

ఆశ్చర్యపడ్డాడు.

ఇంత రాత్రివేళా?!

"చెప్పు" అన్నాడతను నవ్వి.

"నువ్వే గుర్తుకొస్తున్నావు" అన్నది పారిజాతం.

"ఎందుకు చెప్పు" అతడు అడిగాడు.

"తెలీటంలేదు. అనుక్షణం నీ రూపమే నా కళ్ళముందు కదులుతోంది. నమ్ముతావా? ఇప్పటిదాకా నేను ఏ మగాడి గురించీ ఇంతగా ఆలోచించలేదు. నీలో ఏముందోగానీ నా మనసంతా నువ్వే నిండి ఉన్నావు సహదేవ్" అన్నది పారిజాతం ప్రశాంతంగా ఉన్న గొంతుతో.

సహదేవుడు సిగరెట్టు ముట్టించుకోవడం మరచిపోయాడు.

పారిజాతం ఇంకా చెబుతోంది. ఏదో ట్రాన్స్‌లో ఉన్నదానిలా....

"నా గొంతులో ఉన్న శ్రావ్యతకంటే నువ్వు వాయించే ఇన్‌స్ట్రుమెంట్ చేసే ధ్వనిలో మెలోడీ చాలా బావుంటుంది. ఆ మెలోడీ నాక చాలా ఇష్టం. నీ చేతివేళ్ళను ముద్దాడాలనిపిస్తోంది సహదేవ్" అన్నది పారిజాతం గుసగుసలాడుతున్నట్టుగా.

"ఈసారి మనం కలిసినప్పుడు మరచిపోకుండా ఆ పని చెయ్యి. నీకు థాంక్స్ చెప్పుకుంటాను కూడా" అన్నాడు సహదేవుడు. తర్వాత అతనికి తను అన్న మాటకు బాగా నవ్వొచ్చింది. నిజంగా అలా చేస్తుందా ఈ పారిజాతం.

ఉన్నట్టుండి అతడికి గుర్తువచ్చింది సిగరెట్టు సంగతి. గబగబా ఒక సిగరెట్టును ముట్టించి పొగలాగి బయటకు వదిలాడు. పాన్‌షాప్‌లో కూర్చున్న ముసలతను అప్పుడప్పుడు సహదేవుడిని ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

అంతటితో వాళ్ళ సంభాషణ ఆగలేదు.

పారిజాతం మళ్ళీ కొనసాగించింది. "సహదేవ్.... నాదో చిన్న కోరిక. ఏమిటంటే నా గొంతులో ఉన్న శ్రావ్యంతో, నువ్వు నీ వాద్యపరికరంతో పలికించే మెలోడీ కలిసిపోవాలని సమ్మతమేనా?" అనడిగింది.

సహదేవుడు వెంటనే కొంచెం కంగారుపడ్డాడు. తర్వాత సర్దుకుని "ఆలోచించి చెబుతాను" అన్నాడు చాలా తేలిగ్గా.

"వెంటనే చెప్పలేవా?" వెంటనే అడిగింది. ఆశాభంగం చెందిఉండాలి. అతడి జవాబుతో.

"అవును పారిజాతం. ముఖ్యమైన విషయం గురించి ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకోబోయేముందు నేను ఆలోచిస్తాను. అది నా అలవాటు" అన్నాడు సహదేవుడు.

"సరే. అలాగే ఆలోచించుకో... కానీ నాకు త్వరగా నీ నిర్ణయం చెప్పాలి.... ఎదురుచూస్తూ ఉంటాను" అన్నది. అతడు సరేనన్నాడు. తర్వాత పారిజాతం యేదేదో మాట్లాడింది.

టైము గడుస్తోంది.

చివరగా పారిజాతం అతడికి మరోసారి ఐ లవ్ యూ చెప్పి తన మాటలను ముగించింది. సెల్‌ఫోన్‌ను జేబులో వేసుకుంటూ చూసాడు సహదేవుడు.

పారిజాతం నలభై నిముషాలు మాట్లాడింది. అతడికి విపరీతమయిన ఆశ్చర్యం కలిగింది.

పారిజాతం పెళ్లయిన ఆడది అని తెలుసు గానీ ఇంతకుమించి ఆమె భర్త గురించి అతడికి తెలీదు. ఆమెను ఎప్పుడూ అడగలేదు.

ఒక పెళ్ళయిన ఆడది ఇంత రాత్రివేళ పరాయి మగాడితో ఇలా సెల్‌ఫోన్‌లో ఇంతసేపు మాట్లాడుతుంటే భర్త ఊరుకుంటాడా? ఏ ఆడదయినా ఇలాంటి సాహసానికి పూనుకుంటుందా?

పారిజాతం భర్తకు దూరంగా ఉంటుందేమో! ఆమెను భర్త వదిలి వెళ్ళిపోయిఉంటాడా? అంతే అయిఉంటుంది. లేకపోతే ఇలా మాట్లాడటం సాధ్యం అవకపోవచ్చు.

ఈ కారణంవల్లనే వయసులో తను ఆమెకంటే చిన్నవాడయినా తనపట్ల ఆకర్షణ చూపుతోంది. భర్తవల్ల కోల్పయిన ప్రేమను తననించి పొందాలని కోరుకుంటోంది. ఆమె దృష్టిలో ఇప్పుడు తను ఆమె భర్త స్థానంలో ఉన్నాడు.

ఏదో చప్పుడయ్యేసరికి సహదేవుడు ఆలోచన నుంచి బయటపడ్డాడు.

పాన్‌షాపు ముసలాయన షాపు తలుపులను మూస్తున్నాడు. సహదేవుడు నిల్చున్నాడు. అప్పుడు ఆ ముసలాయన వచ్చి ఆ మాసిపోయిన కుర్చీని తీసి షాపులో ఉంచి తాళం వేసుకున్నాడు.

పన్నెండు గంటలు దాటిన ఆ సమయంలో సహదేవుడు ఇంకో సిగరెట్టు ముట్టించి తన ఇంటివైపు నడవసాగాడు.

❖ ❖ ❖

నాలుగు రోజులు గడిచాయి. ఈ నాలుగు రోజులూ రాత్రి పొద్దుపోయాక పారిజాతం ప్రతి రాత్రీ సహదేవుడికి ఫోన్‌చేసి అరగంటకు పైగా మాట్లాడింది. మాటల మధ్యలో ఆమే చెప్పింది. కొన్నాళ్ళ క్రితం తన భర్త చనిపోయాడనీ సహదేవుడితో కలిసి అతడ్ని తోడుగా చేసుకుని జీవించాలని అనుకుంటున్నాదనీ చెప్పింది. అతడు మౌనాన్ని ఆశ్రయించాడు. ఆమెతో ఏమీ చెప్పలేదు.

తన ఆరోగ్యంలో ఏదో మార్పు కలుగుతోందనీ, ఏదో అనారోగ్యం తనలో ప్రవేశించిందనీ సహదేవుడికి అనుమానం వచ్చింది.

డాక్టరు దగ్గరకు వెళితే ఆయన కొన్ని పరీక్షల అనంతరం–

"ప్రాథమిక దశలోనే ఉంది కాబట్టి ఆపరేషన్‌తో తప్పక నయమవుతుంది. ఒక వారంరోజులు హాస్పిటల్‌లో ఉండి తర్వాత వెళ్ళి మీ పనులు మీరు చేసుకోవచ్చు" అని చెప్పాడు.

ఆ మర్నాడే పారిజాతానికి ఫోన్లో ఈ విషయాన్ని చెప్పాడు సహదేవుడు.

పారిజాతం విని ఊరుకుంది.

సహదేవుడికి ఆపరేషన్ జరిగింది. అతడి ఇద్దరి మిత్రులవల్ల ఈ వార్త మిగిలిన అందరికీ తెలిసిపోయింది. ఆపరేషన్ అనంతరం సహదేవుడు బెడ్ మీదికి చేరాడు. అతడికి సేవలు చేస్తూ అతడి భార్య సులోచన అతడి దగ్గరే ఉన్నది. అప్పటినించీ అతడి స్నేహితులు ఎవరో ఒకరు వచ్చి అతడిని కలిసి పరామర్శ చేస్తూనే ఉన్నారు. పరిచయస్తులూ, స్నేహితులూ, బంధువులూ, ఇలా ఎవరో ఒకరు.

ఇన్ని మాటలు చెప్పి పారిజాతం ఒక్కసారి కూడా ఫోన్ చేసి ఆపరేషన్ అయ్యిందా? ఇప్పుడెలా ఉంది? అని అడక్కపోవడం అతడిని ఆశ్చర్యానికి గరిచేసింది.

ఏమిటీ మనిషి? అనుకున్నాడు.

నాలుగు రోజులు గడిచాయి. తనని చూట్టానికి వస్తుందని అనుకున్నాడు.

కానీ పారిజాతం రాలేదు.

సహదేవుడు బెడ్‌మీద కూర్చుని బయటకు చూస్తే ఎదురుగా ఉన్న గేటు, దాని ముందున్న రోడ్డు కనపడతాయి. గోడనానుకుని బెడ్‌మీద కూర్చున్నాడు సహదేవుడు. గేటులోనించి బయటకు వెళ్తున్న మనుషులు లోపలకు వస్తున్న మనుషులు కనపడుతున్నారు.

తనని పరామర్శించటానికి ఎంతమంది వస్తున్నా సహదేవుడు మాత్రం ఎప్పటికప్పుడు పారిజాతం వస్తుందేమోనని గేటువైపు ఆశగా చూస్తూనే ఉన్నాడు.

కానీ పారిజాతం రాకుండానే సహదేవుడు హాస్పిటల్ నించి బయటపడి ఇంటికి వచ్చాడు.

అతడు ఇంటికి వచ్చిన రెండవ రోజున పారిజాతం అతడికి ఫోన్ చేసింది.

"డియర్ సహదేవ్.... నేను చాలా బాధపడుతున్నాను. హాస్పిటల్ నిన్ను కలవాలని నేను ఎంతగానో ప్రయత్నం చేసాను. కానీ పనుల ఒత్తిడివల్ల కుదరలేదు. ఇప్పుడే బంధువుల రాకపోకలు. ఏం చెయ్యను? నా మనసంతా నీ దగ్గరే ఉంది. ఈ వారం రోజులూ నీ దగ్గరే ఉందామనుకున్నాను. ఏదిఏమైనా నువ్వు క్షేమంగా ఇల్లు చేరినందుకు సంతోషంగా ఉంది. నువ్వు చాలా త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను" అని చెప్పింది ముందుగానే ప్రిపేర్ అయినదానిలా.

సహదేవుడు థాంక్స్ చెప్పాడు.

❖ ❖ ❖

ఆడిటోరియం రంగురంగుల లైట్లతో వెలిగిపోతోంది. జనం నిండుగా ఉ

న్నారు.

వేదికమీద మైకు ముందు నిల్చుని చేతులు కదిలిస్తూ శ్రావ్యంగా పాడుతోంది పారిజాతం. ఆమె గొంతులో ఉన్న మాధుర్యం అలాంటిది.

పాడుతున్న పారిజాతానికి ఒక పక్కగా వాద్యకారులు ఉన్నారు. రకరకాల వాద్యపరికరాలు మోగుతున్నాయి. అందరికీ కొంచెం వెనగ్గా సహదేవుడూ కూర్చుని ఉన్నాడు. అతడు కోలుకున్న తర్వాత అతడికి ఇది మొదటి ప్రోగ్రాం. అతడు ఏమంత ఉత్సాహంగా లేడు. అతడు వాయిస్తున్న వాద్యపరికరం జోరు ఎప్పటిలా లేదు. ఆ ధ్వనిలో మెలోడీ కూడా పడిపోయింది. ఈ భేదాన్ని పారిజాతం పాడుతూనే గమనించింది. అతడి మనసు సరిగా లేదని గ్రహించింది. ఇంతకుముందయితే అతడి వాద్యపరికరం మెలోడీ తన గొంతులోని శ్రావ్యతతో పోటీ పడుతున్నట్టు ఉండేది. కానీ ఈసారి అలా లేదు. అందరికీ తెలీకపోవచ్చు. పారిజాతం తెలుసుకుంది. ప్రోగ్రాం అయినాక తెలుసుకోవాలనుకుంది.

క్రమంగా కచేరీ ముగింపుకు వచ్చింది.

పారిజాతం చివరగా ఒక జానపద ప్రేమగీతాన్ని ఆవేశంగా పాడింది. సహదేవుడూ ఆ పాట మొదటినించీ చివరివరకూ వాయిద్యాన్ని పలికించకుండా మిన్నకుండిపోయాడు.

కచేరీ ముగిసింది.

చప్పట్లతో ఆడిటోరియం మార్మోగిపోయింది.

జనం గుంపులు గుంపులుగా వెళ్ళిపోయారు. వాద్యకారుల బృందానికి భోజనాలు అక్కడే ఏర్పాటు చేయబడినాయి.

రాత్రి పదయ్యింది.

బయట వెన్నెలలో పగలులా ఉంది.

ఆకాశంలో పున్నమి చంద్రుడు వెలిగిపోతున్నాడు. భోజనమయినాక సహదేవుడు మేడమీదకు వెళ్ళాడు. పైన అంతటా వెన్నెల వెలుగు ఆక్రమించుకుని ఉంది. పిట్టగోడను ఆనుకుని కాళ్ళు జాపుకుని కూర్చుని సిగరెట్టు వెలిగించి పొగ వదులుతూ చంద్రుడిని చూస్తూ కూర్చున్నాడు.

అతడి వెనకవైపు గోడకు అవతలివైపు బాగా ఎత్తుగా పెరిగిన కొబ్బరిచెట్టు ఆకులు గలగలమంటున్నాయి.

కొంతసేపటికి పారిజాతం సవ్వడి లేకుండా వచ్చి అతడి పక్కన నిల్చుని

సహదేవుడిని చూసింది. అతడు కొంచెం సర్దుకుని కూర్చున్నాడు. ఆమెను చూసి కూడా అతడు మాట్లాడలేదు.

'ఇవాళ నీకేమయ్యింది సహదేవ్" అన్నది అతడి పక్కనే కూర్చుంటూ.

"ఏమీ కాలేదు. బాగానే ఉన్నాను" అన్నాడు పొడిగా.

"నాకు తెలుసు. నువ్వు చెప్పటం లేదు. నీకేదో అయ్యింది" అన్నది మళ్ళీ.

"అదే తెలీటం లేదు" అన్నాడతడు.

"సరే వదిలెయ్. నాకు ఈ క్షణంలో ఒకటి అనిపిస్తోంది"

"ఏమనిపిస్తోంది?" అడిగాడు కుతూహలంగా.

"నీ వొళ్ళో తల ఉంచి పడుకోవాలని అంది" మొహం మీదకు వొంగి.

"కాదు. అనంగీకారం" అన్నాడు వెంటనే.

దెబ్బతిన్నట్లు చూసింది పారిజాతం. ఆమె అక్కడనించి లేచి వెళ్ళటానికి ప్రయత్నం చేస్తున్నప్పుడు అతడు "కూర్చో నీకో విషయం చెప్పాలి" అన్నాడు.

"ఏమిటో చెప్పు" అన్నది పారిజాతం తను కూడా బాగా గోడను ఆనుకుని.

అతను చెప్పటం మొదలుపెట్టాడు.

"ఆపరేషన్ అనంతరం నా గదిలో బెడ్‌మీద ఉన్నానుకదా.... నా బెడ్‌మీద కూర్చుంటె బయట గేటు క్లియర్‌గా కనపడేది. నా భార్య సులోచన నా పక్కనే ఉండేది. రోజూ ఎంతోమంది వచ్చి నన్ను, నా ఆరోగ్యాన్ని పరామర్శించి వెళ్తూ ఉండేవారు. అయినా నా చూపులు ఎవరికోసమో ఆత్రంగా ఎదురుచూస్తున్నట్టు గేటువైపుకే చూస్తుండేవి. చివరకు నా చూపుల్లో నిరాశ. ధైర్యం. ఒకసారి సులోచన అడిగింది కూడా. ఎవరికోసం ఎదురుచూస్తున్నారు అంతగా అని ఎలా చెప్పగలను? చెప్పలేదు. చివరకు ఏమనుకుందో ఏమోగానీ వచ్చింది సులోచన. అంతగా నన్ను మనస్తాపానికి గురిచేసిన పారిజాతం నిజంగా కన్నీరు కార్చింది" అన్నాడు వొత్తి పలుకుతూ....

పారిజాతానికి ఇనుపకమ్మీతో వీపుమీద కొట్టినట్టు అనిపించి చటుక్కున నిల్చుని విసవిసా నడిచి ఆ వెన్నెల్లో పొడవాటి తన నీడ తోడు రాగా అక్కడినించి వెళ్ళిపోయింది. ❖

*చిత్ర మాసపత్రిక, డిసెంబర్ 2013*